సాక్షి మెదక్

శనివారం । 21 । జూన్ । 2025



ఉపయోగాలెన్నో

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గీతా స్కూల్ విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. నాలుగు వందలకుపైగా విద్యార్థులు యోగా డే, యోగాసనాల ఆకారంలో కూర్చొని విశిష్టతను తెలియజేశారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మనో వికాసం కలుగుతోందని అన్నారు.

– తూప్రాన్





అటు ఆహ్లాదం.. ఇటు డెక్క మయం

చిట్కుల్ శివారులోని మంజీరా నది ఆహ్లాదం పంచుతోంది. వంతెనపై నుంచి చూస్తే నదిలో ఒకవైపు ప్రశాంతంగా పారుతున్న నీరు, మరోవైపు పూర్తిగా నిండిన గుర్రపు డెక్క దర్శనమిస్తోంది. దీంతో వంతెన పైనుంచి వెళ్తున్న వాహనదారులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. అయితే ఎగువ నుంచి వచ్చిన నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన గుర్రపు డెక్క చిట్కుల్ శివారులోని వంతెన కింద నిలిచింది.

– చిలప్‌చెడ్(నర్సాపూర్)

న్యూస్‌రీల్

'తాగునీటి సమస్య రానివ్వం'

మెదక్‌జోన్: మెదక్ మున్సిపాలిటీకి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపు పగిలిపోవటంతో ఇతర నీటి వనరులను ఉపయోగించి ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని అదనపు కలెక్టర్ నగేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణానికి ర్యాలమడుగు శివారు నుంచి తాగు నీరు నీరు సరఫరా అవుతుందని, అది పగిలిపోవటంతో మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. కాగా ప్రజలకు నీటి ఎద్దడి రానివ్వకుండా పట్టణంలోని పంపు సెట్లను ఉపయోగిస్తూ పట్టణ ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు.

బస్సుల కోసం ఆందోళన



కొండాపూర్ చౌరస్తా వద్ద గ్రామస్తుల ధర్నా

నర్సాపూర్ రూరల్: రద్దు చేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నత్నయ్యపల్లి, కాగజ్ మద్దూర్, కొండాపూర్ గ్రామస్తులు శుక్రవారం నర్సాపూర్–హైదరాబాద్ 765డీ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. గతంలో గంటకు ఒక బస్సు నడిపేవారని, ప్రస్తుతం ఒక బస్సు కూడా నడపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోయారు. అనంతరం డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్ గౌడ్, మండల అధ్యక్షుడు నగేశ్, రాజు మద్దతు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, సిబ్బందితో కలిసి సైబర్‌నేరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు భరోసా కలిగించాలని, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి, అల్లాదుర్గం ఎస్‌ఐ శంకర్, ఏఎస్‌ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

49 మంది గిరిజన విద్యార్థుల ఎంపిక

మెదక్ కలెక్టరేట్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అవకాశాలు మెండుగా ఉన్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లాలో 3, 5, 8వ తరగతుల్లో చేరేందుకు మొత్తం 78 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. శుక్రవారం కలెక్టరేట్‌లో లక్కీడ్రా ద్వారా 49 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్.. పరేషాన్!



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈనెల 1 నుంచి జిల్లాలో ముందస్తు జ్వర సర్వేను ప్రారంభించారు. కేవలం 20 రోజుల వ్యవధిలో 9 వేల పైచిలుకు జ్వర పీడితులను గుర్తించారు. వారికి వెంటనే వైద్య చికిత్స ప్రారంభించారు. అలాగే వ్యాధులు బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– మెదక్‌జోన్

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ
- జిల్లాలో కొనసాగుతున్న ఫీవర్ సర్వే
- ఇప్పటికే 9 వేల పైచిలుకు జ్వర పీడితుల గుర్తింపు

జిల్లాలో గతేడాది నమోదైన కేసులు	
డెంగీ	28
టైఫాయిడ్	280
జ్వర పీడితులు	16,000

జిల్లాలో 21 మండలాల పరిధిలో 693 గ్రామాలు ఉండగా, 7.67 లక్షల జనాభా ఉన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 19, అర్బన్ హెల్త్‌సెంటర్ 1, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 2, ఏరియా ఆస్పత్రి 1, జిల్లా కేంద్ర ఆస్పత్రి 1, ఎంసీహెచ్ 1, చొప్పున మొత్తం 25 ఆస్పత్రులు ఉన్నాయి. కాగా వానాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులను ముందస్తుగా గుర్తించి ప్రాణనష్టం జరగకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 1 నుంచి ముందస్తు జర్వ సర్వేను ప్రారంభించారు. జిల్లాలో ఒక్కో ఆశవర్కర్ 20 ఇళ్లను సర్వే చేసి ఎప్పటికప్పుడు సంబంధిత ఏఎన్‌ఎం దృష్టికి తీసుకెళ్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి వారికి చికిత్స ప్రారంభించటంతో పాటు వారి పేరు, ఊరు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడే



పెద్దశంకరంపేటలో జ్వర సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యల గురించి వివరిస్తున్నారు. కాగా గతేడాది వానాకాలం సీజన్ మొత్తంలో 16 వేల మంది జ్వర పీడితులు ఉంటే, కేవలం ఈ 20 రోజుల్లోనే 9,231 మంది జ్వర పీడితులను గుర్తించటం గమనార్హం.

పరిశుభ్రతే ప్రధానం

ఈ ఏడాది సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడటం వైద్యారోగ్యశాఖ అధికారులకు కత్తిమీద సాములాంటిదనే చెప్పాలి. గత 16 నెలలుగా పాలకవర్గాలు లేక పల్లెల్లో పాలన గాడితప్పింది. పంచాయతీ కార్యదర్శులు చెత్త ట్రాక్టర్లకు డీజిల్ పోయలేమంటూ చేతులెత్తేశారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఈక్రమంలో జిల్లా అధికారులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీసీ సస్పెన్షన్



పాపన్నపేటలోని వెలుగు కార్యాలయం

- డ్వాక్రా రుణాల గోల్‌మాల్‌పై వేటు
- బ్యాంకు అధికారులపై చర్యలు కరువు

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): 'సంఘాల నిధులు స్వాహా' శీర్షికన గత నెల 15న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఆర్‌డీఏ అధికారులు నెల రోజులకు పైగా విచారణ జరిపారు. మహిళా సంఘాలకు సంబంధించి రూ. 39,92,141 నిధులను వీఓఏ పద్మ స్వాహా చేసినట్లు తేల్చారు. ఈ మేరకు విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీసీ సాయిలును సస్పెండ్ చేస్తూ డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ గోల్‌మాల్‌లో బ్యాంకు అధికారుల పాత్ర సైతం ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలో జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో 39 డ్వాక్రా గ్రూపులు ఉండగా, వీరికి యూకో బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఇందులో గ్రామ సంఘం నిధులతో పాటు, బ్యాంకు ద్వారా రెండు రకాల రుణాలు పొందవచ్చు. అయితే గ్రామ సంఘం నుంచి తీసుకునే రుణాలకు అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి సంతకాలతో తీర్మానం చేయాలి. ఇవి మొదట గ్రూపు అకౌంట్‌లో జమ చేసి తర్వాత సభ్యులకు పంపిణీ చేయాలి. కానీ వారి సంతకాలను ఫోర్జరీ చేసి సభ్యులకు తెలియకుండా గ్రామ వీఓఏ పద్మ సుమారు రూ. 26.50 లక్షలు సొంత అకౌంట్‌లోకి మళ్లించుకున్నట్లు డీపీఎం ప్రకాశ్ తెలిపారు. అయితే ఇందులో అప్పటి బ్యాంకు అధికారుల పాత్ర ఉన్నట్లు తెలిసింది. అలాగే బ్యాంకు నుంచి మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చే రుణాలు సైతం సభ్యుల అకౌంట్లలోకి వెళ్లకుండా, నేరుగా వీఓఏ అకౌంట్లో జమ అయినట్లు తెలిసింది. ఇవి సుమారు రూ.13.40 లక్షల వరకు ఉన్నట్లు తేలింది. అయితే వీఓఏ ఈ విషయాలు బయట పడకుండా దొంగ రసీదులు, తీర్మానాలు, సంతకాల ఫోర్జరీ చేసి, అధికారులకు అనుమానం రాకుండా రికార్డులు నిర్వహించినట్లు సమాచారం. సీసీ నిర్లక్ష్యంతో అవినీతి భాగోతం సకాలంలో బయట పడలేదని భావించిన అధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా మహిళా సభ్యుల వ్యక్తిగత అకౌంట్లోకి వేయాల్సిన రుణాలను అప్పటి బ్యాంకు అధికారి వీఓఏతో కుమ్మక్కై ఆమె సొంత అకౌంట్లోకి మళ్లించారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయమై బ్యాంకు అధికారులు సైతం శాఖాపరమైన విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే సుమారు 35 రోజుల దాటినా వారి విచారణ కొలిక్కి రాకపోవడం గమనార్హం. వీఓఏ మాత్రం తాను సీసీతో పాటు ఏపీఎంలకు లంచాలు ఇచ్చినట్లు ఆరోపించారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్)/నర్సాపూర్ రూరల్: కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి పిల్లల కోసం మోడల్ స్కూల్స్, గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య, ఆర్‌ఓ ప్లాంట్, బస్సుల సౌకర్యం వంటి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శేఖర్, సత్యంగౌడ్, భిక్షపతి, జితేందర్‌రెడ్డి, ఆంజనేయగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్, హుస్సేన్, ప్రసాద్, ప్రిన్సిపాల్ ఫర్హాన తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఐసీడీఎస్ సీడీపీఓ హేమాభార్గవి

నర్సాపూర్: రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమాభార్గవి అన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సంతలో అంగన్‌వాడీ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్లు కవిత, సరళకుమారి, లక్ష్మి, నర్సమ్మ పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గీత దాటితే వేటు తప్పదు

డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్)/కౌడిపల్లి(నర్సాపూర్): ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఈఓ రాధాకిషన్ హెచ్చరించారు. శుక్రవారం మండల వనరుల కేంద్రంలో వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. పాఠ్య పుస్తకాలు అమ్మాలంటే విధిగా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే కౌడిపల్లి మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో టచ్‌ఫర్ చేంజ్ ట్రస్ట్, పెగా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు రూ. 12 లక్షలతో వాటర్ ప్లాంట్, బాల బాలికల కోసం వేర్వేరుగా నిర్మించిన టాయిలెట్స్‌తో పాటు బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ కార్పొరేట్ రెస్పాన్స్ స్కీం ఆధ్వర్యంలో నిర్మించిన టాయిలెట్స్‌ను ప్రారంభించారు.

జిల్లాలో 25 వేల దరఖాస్తులు: కలెక్టర్



మడూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామసభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, రెండు నెలల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మడూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 25 వేల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. సమస్యను పరిష్కరించలేని సమయంలో వారికి లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తామన్నారు. శనివారం సైతం మ దూర్‌లో గ్రామ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జెడ్పీ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫాం, పుస్తకాలు అందాయా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

మెదక్‌జోన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించే యోగా వేడుకల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా చక్కటి ఔషదం అన్నారు.

పంచాయతా.. పరిషత్తా?

'స్థానిక' ఎన్నికలపై జోరుగా చర్చ

- పల్లెల్లో మొదలైన పోరు సందడి
- స్థానిక సంస్థలకు నిలిచిన ఆర్థిక సంఘం నిధులు
- పలు చోట్ల అభివృద్ధి పనులకు బ్రేక్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,531 జీపీలు, ఎంపీటీసీలు 690, జెడ్పీటీసీలు 72

గ్రామ పంచాయతీ ఎన్నికలు ముందు జరుగుతాయా.. లేక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయా? అని పల్లెల్లో జోరుగా చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రుల ప్రకటనతో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం వేగం పెంచింది. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 6వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే నెలలో జరుగుతాయని సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఆశావహులు సైతం పోటీకి రెడీ అవుతున్నారు.

సాక్షి, సిద్దిపేట:

ఉమ్మడి మెదక్ జిల్లాలో 19,62,458 మంది పల్లె ఓటర్లుండగా 1,531 గ్రామ పంచాయతీలు, 690 ఎంపీటీసీలు, 72 జెడ్పీటీసీలు ఉన్నాయి. గతేడాది జూలై 4వ తేదీతో మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుడు(ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు (జెడ్పీటీసీ) పదవీకాలం, గతేడాది ఫిబ్రవరి 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగిశాయి. అప్పటి నుంచి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ సింబల్ ఉండదు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరుగుతాయి. ఈ నేపథ్యంలో ఏ ఎన్నికలు



గ్రామ పంచాయతీ కార్యాలయం

ముందు నిర్వహిస్తే అధికార పార్టీకి లాభం అనే చర్చ కాంగ్రెస్ నేతల్లో జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి కావడంతో ప్రభుత్వ పాలన రెఫరండంగా భావించే అవకాశం ఉంది.

ఆశల్లో కాంగ్రెస్ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లు రాష్ట్రపతి దగ్గరనే ఇంకా పెండింగ్‌లో ఉంది. బిల్లు ఆమోదం తర్వాతనే నిర్వహిస్తారా? పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారో.. వేచి చూడాలి. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు స్థానిక పదవుల పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎక్కువ మంది లేకపోవడంతో కొంత వెనుకబడి ఉంది. దీంతో ముఖ్యంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ లాంటి పదవులు దక్కితే పార్టీ కొంత బలపడుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

నిలిచిన ఆర్థిక సంఘం నిధులు

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. అదే పాలకవర్గాలుంటే ప్రతీ ఏడాది కేంద్రం నుంచి ప్రత్యేక నిధులను కేటాయించేవారు. ఆర్థిక సంఘం నుంచి నిధులు రాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిలా	పంచాయతీలు	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	ఓటర్లు
సిద్దిపేట	508	230	26	6,54,628
సంగారెడ్డి	531	271	26	7,83,379
మెదక్	492	189	20	5,24,451

అధికారులకు ప్రజల గోస పట్టదా?

- నాలుగు రోజులుగా నీరు రాకుంటే పట్టించుకోరా?
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న పద్మారెడ్డి

మెదక్ కలెక్టరేట్: మెదక్ పట్టణంలో గత 4 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి గోస అధికారులకు పట్టదా? రేపటిలోగా సమస్య పరిష్కరించకుంటే పెద్దఎత్తున ధర్నా చేపడుతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. పైప్‌లైన్ మరమ్మతు పనులు 4 రోజులుగా పూర్తి చేయకపోవడంపై అధికారుల సమన్వయ లోపం కనిపిస్తుందన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా ప్రజలకు నీరు అందించలేకపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పరిధిలోని చిన్నారెడ్డి గూడెం గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి (35) రామచంద్రాపురం పరిధి వెలమెలలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో కారు నడుపుతూ స్థానికంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 19న రాత్రి మహేందర్ తన ద్విచక్ర వాహనంపై శంకర్‌పల్లి వైపు నుంచి వెలమెల గ్రామానికి వస్తుండగా నందిగామ గ్రామ సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరు నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతడిని పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ గౌడ్ వివరాల ప్రకారం... సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేటకు చెందిన గొల్ల అనిల్(35) వ్యవసాయం చేస్తున్నాడు. తన బైక్‌పై సదాశివపేట వైపు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ సమీపంలో గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

55 గంజాయి చాక్లెట్లు పట్టివేత

రూ. 35 వేల మద్యం సీజ్

పటాన్‌చెరు టౌన్: గంజాయి చాకెట్లతోపాటు, రూ.35 వేల విలువ చేసే మద్యం ను విజిలెన్స్ పోలీసులు సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ నాగుల్ మీరా, ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వాణి నగర్‌లో శుక్రవారం రామచంద్రపురం విజిలెన్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వెంకటయ్య, రవీందర్ వద్ద నుంచి రూ.35 వేల విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఒరిస్సాకు చెందిన జితేందర్ మాలిక్ నుంచి రూ. 7వేల విలువైన 55 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం, గంజాయి చాక్లెట్లను పటాన్ చెరు ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం కుదవ పెట్టేందుకు వస్తే..

- 3 తులాల బంగారు గొలుసు, రూ.13వేలు చోరీ
- జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన

జోగిపేట(అందోల్): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగులో నుంచి మూడు తులాల బంగారు నల్లపూసల దండ, రూ.13 వేలను తస్కరించారు. ఈ ఘటన జోగిపేట మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పాండు కథనం ప్రకారం... వట్టిపల్లి మండలం గొర్రెకల్ గ్రామానికి చెందిన కుర్తివాడ భార్గవి స్వగ్రామం నుంచి బంగారు నల్లపూసల దండను బ్యాంకులో కుదవ పెట్టేందుకు వట్టిపల్లి నుంచి జోగిపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది. జోగిపేట బస్టాండులో బస్సు దిగుతుండగా రద్దీ ఎక్కువగా ఉండటంతో ఎవరో గుర్తుతెలియని వారు తన బ్యాగులోని పర్సును ఎత్తుకెళ్లారు. వెంటనే అప్రమత్తమై చూడగా ఎవరు కనిపించలేదు. ఆ సమయంలో సీసీ కెమెరాలను పరిశీలించగా పట్టణంలో చెట్ల కొమ్మలు నరికేందుకు విద్యుత్ అధికారులు కరెంట్ కట్ చేశారు. దీంతో చేసేదేమీ లేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై చెరువులో శవమై..


సత్యనారాయణ

మిరుదొడ్డి(దుబ్బాక): అదృశ్యమైన వ్యక్తి వాగులో శవమయ్యాడు. ఈ ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రమోద్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన చీమిడి సత్యనారాయణ (45)కు భార్య ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. యేడాది క్రితం పెద్ద కూతురు వివాహం చేశాడు. వివాహం కోసం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతం అవుతుండేవాడు. కొంత కాలంగా సత్యనారాయణ మతిస్థిమితం కోల్పోయి అక్కడక్కడ తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా కూడవెల్లి వాగు మోతె గ్రామ శివారులోని ఎల్లమ్మ దుబ్బ చెక్‌డ్యాంలో సత్యనారాయణ శుక్రవారం మృతదేహమై కనిపించాడు. ప్రమాదవశాత్తు చెక్‌డ్యాం నీటిలో పడి మృతి చెంది ఉండవచ్చని గ్రామస్తులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగా చేద్దాం..ఆరోగ్యంగా ఉందాం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- జిల్లాలో విరివిగా శిబిరాలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు యోగాసనాలు
- రోజు చేస్తే బోలెడన్నీ ప్రయోజనాలు


నర్సాపూర్ బాలుర హాస్టల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మెదక్ కలెక్టరేట్: శారీరక, మానసిక ఆందోళనలను తగ్గిస్తూ, సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చి నిత్య నూతనోత్సాహాన్ని అందించేది యోగా. ప్రతి రోజు యోగా, ధ్యానం చేసేవారు మహాయోగాన్ని కల్గి ఉన్నట్టేనని అని మన పెద్దలు చెబుతుంటారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల స్టేడియంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 5.30 గంటల నుంచి యోగా సాధన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అనేక వ్యాధులకు మందు

యోగా ద్వారా అనేక వ్యాధులకు సిద్దిపేట యోగా శిక్షకులు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. యోగా హెల్త్ డ్రైవ్ పేరిట అస్తమా, డయాబెటీస్, తదితర వ్యాధులకు ఆక్యుపంక్చర్, మడ్‌బాత్(మట్టిస్నానం)లతో యోగా చికిత్స నిర్వహిస్తున్నారు. దీంతో అనేక మంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు యోగా ద్వారా లబ్ధి పొందుతున్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఆయూష్ ఆయుర్వేద వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రుల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ కేంద్రాల ద్వారా ప్రజలకు, విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా యోగా నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ, యువజన క్రీడలశాఖ, విద్యాశాఖలను సమన్వయం చేసుకుంటూ ఆయూష్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించనున్నారు.


సిద్దిపేటలో యోగా చేస్తున్న మహిళలు

యోగా లోగో ఆవిష్కరణ


యోగా లోగోను ఆవిష్కరించిన దృశ్యం

రామాయంపేట(మెదక్): అంతర్జాతీయ యోగాను పురస్కరించుకొని ఆయుష్ శాఖ, వివేకానంద విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం స్కూలు ఆవరణలో యోగా దినోత్సవ లోగోను ఆవిష్కరించారు. వంద మంది విద్యార్థులు లోగో చుట్టూ కూర్చున్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు మద్దెల భరత్ విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు.

యోగాతో ప్రయోజనాలు

- శారీరకంగా, మానసికంగా ధృడంగా మారుతాం.
- శ్వాసక్రియలో ఇబ్బందులు, జీర్ణ సమస్యలు దరి చేరవు.
- తలనొప్పి, మైగ్రేన్ అంటే పార్శ్వపునొప్పి తగ్గిపోతుంది.
- ఏకాగ్రత, జ్ఞాపక శక్తి, గ్రహణశక్తి పెరిగి ఆత్మ విశ్వాసం, స్వీయ క్రమశిక్షణ అలవడతాయి.
- భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి.
- ఆక్సీజన్‌తో కూడిన రక్తం శరీరమంతా విస్తరిస్తుంది.
- కంప్యూటర్ వర్క్ చేసేవారికి ఎన్నో విధాలుగా ప్రయోజనం
- యోగాతో ఆరోగ్యానికి మేలు చేసే హార్మోన్లు విడుదల అవుతాయి.
- రోగ నిరోధక శక్తి పెరిగి సైనస్, ఎలర్జీ, నిద్ర లేమి, కంటి సమస్యలు కూడా తగ్గుతాయి.
- వద్ధాప్య ఛాయలు దూరమై యవ్వనంగా కనిపిస్తారు.

యోగాధీరుడు


సంఖ్యాసన వేస్తున్న కృష్ణ

టేక్మాల్ (మెదక్): యోగాలో ప్రతి ఒక్క ఆసనం వేస్తూ యోగా ధీరుడు అనిపించుకుంటున్నాడు టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థి. మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన దిగాల కృష్ణ ఆరవ తరగతి నుంచి టేక్మాల్ మోడల్ స్కూలులో చదువుతున్నాడు. పలు రకాల ఆసనాలు అవలీలగా వేస్తూ అందరినీ అబ్బురపరుస్తున్నాడు. మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో తన ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. పాఠశాల తరఫున యోగా పోటీల్లో పాల్గొని రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. అంతే కాకుండా జాతీయస్థాయిలో బెంగళూరు, మహారాష్ట్రలో పాల్గొని అందరిని తన ఆసనాలతో ఆశ్చర్యపరిచాడు.

మంచి ఆరోగ్యం సొంతం



యోగా అనేది మన పూర్వీకులు ప్రపంచానికి అందించిన గొప్ప సంపద. ప్రతి రోజు యోగా చేసిన వారికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుంది. యోగాను అన్ని వయస్సుల వారు, స్త్రీలు, పురుషులు చేయవచ్చు. నిత్యం యోగా చేయడం ద్వారా డయబెటీస్, అధిక బరువు, నడుం నొప్పులు తదితర వాటికి యోగా మంచి పరిష్కారం.

– శివ్వ శ్రీనివాస్, యోగా శిక్షకులు, సిద్దిపేట

ప్రతి రోజు యోగా చేస్తా



నేను కొన్నేళ్లుగా ప్రతి రోజు యోగా చేస్తున్నా. దీంతో పాటు ఇతరులకు యోగా ద్వారా కలిగే మంచిని వివరిస్తున్నా. మా కాలనీలో అందరూ కలిసి యోగా చేస్తున్నాం. మానసికంగా ఎంత ఒత్తిడి ఉన్న తగ్గించుకోగల్గుతున్నాం. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలు, వృద్ధులకు అనేక శారీరక సమస్యలు నయమవుతాయి.

– చకిలం, సవిత, సిద్దిపేట, గృహిణి

రోజుకు గంటసేపు యోగా..

నేటి పోటీ ప్రపంచంలో ప్రజలు నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ సమస్యలతో ఉరుకుల పరుగుల జీవితాన్ని గడుపుతున్నారు. ఈ తరుణంలో అనేక సమస్యల వల్ల మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తుంది. ఉరుకుల, పరుగుల మనిషి జీవితంలో రోజులో గంట యోగాకు కేటాయిస్తే 99శాతం అనారోగ్య సమస్యలుండవు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ప్రజలంతా యోగా చేయడం అలవర్చుకోవాలి.

–మనోహర్‌రెడ్డి, డిప్యూటీ కోఆర్డినేటర్, ఆయూష్, మెదక్

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం


సుప్రియ

వర్గల్(గజ్వేల్): వివాహిత అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మేడ్చల్ జిల్లా అత్వెల్లి గ్రామానికి చెందిన సుప్రియ(20)కు నెల రోజుల క్రితం వేలూరుకు చెందిన గాయి మహేష్‌తో వివాహమైంది. శుక్రవారం రాత్రి దంపతులు భోజనం చేసి పడుకున్నారు. అదే రాత్రి మహేష్ నిద్రలేచి చూస్తే భార్య సుప్రియ కన్పించలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఇదే విషయం అత్తగారికి తెలియజేశాడు. శుక్రవారం సుప్రియ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూల దుకాణానికి వెళ్లిన వ్యక్తి..


యూసుఫ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... పాంబండ గ్రామానికి చెందిన ఎండీ యూసుఫ్ శివ్వంపేటలో నివాసం ఉంటూ కూలీ పనులతో పాటు నర్సాపూర్ పూల దుకాణంలో పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 18న నర్సాపూర్ పూల దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా రెండు సార్లు ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి వచ్చాడు. శుక్రవారం యూసుఫ్ భార్య ఆఫ్రిన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగు కోసం వెళ్లిన యువతి..


నిఖిత

వర్గల్(గజ్వేల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన వర్గల్ మండలం నాచారంలో జరిగింది. గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి వివరాల ప్రకారం.... గురువారం ఉదయం 11గంటలకు గ్రామానికి చెందిన వెంకటేష్ కూతురు నిఖిత(19) పెరుగు ప్యాకెట్ తెస్తానని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. శుక్రవారం యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్ట్


గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్న అధికారులు

మునిపల్లి(అందోల్): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. బీదర్ నుంచి హైదరాబాద్‌కు ఆటోలో గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేసి ఆటోలో తరలిస్తున్న 380 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేశారు. హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన సఫీ అలీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో సీఐ గాంధీ నాయక్, ఎస్‌ఐ యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ హలీం, కానిస్టేబుల్ కరీమా, మల్కయ్య, యాదయ్య, రామారావు ఉన్నారు.

కొమురవెల్లి మండలంలో..

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న యువకున్ని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో చేర్యాల సీఐ శ్రీను, ఎస్‌ఐ రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. రాంసాగర్ గ్రామానికి చెందిన యువకుడు పాకనాటి అరవింద్ పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా గంజాయి సేవించేందుకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలో సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రాంసాగర్ శివారులో గంజాయి విక్రయించేందుకు ఒక చెట్టు వద్ద వేచి ఉండగా పోలీసులు అతడిని అదుపులోకి రిమాండ్‌కు తరలించారు.

చైన్ స్నాచింగ్.. దాడి

- బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన దుండగులు
- చికిత్స పొందుతున్న మహిళ


అన్నపూర్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): వాకింగ్‌కు వెళ్లిన మహిళను గుర్తు తెలియని దుండగులు అటకాయించి దాడికి పాల్పడ్డారు. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. దుండగుల చేతిలో తీవ్ర గాయాలపాలైన ఆమెను ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు రంగన్నగారి జెన్నారెడ్డి భార్య అన్నపూర్ణ భూంపల్లి పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న వెంచర్‌లో ప్రతి రోజు వాకింగ్‌కు వెళ్తుంది. శుక్రవారం వెంచర్‌లో వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అన్నపూర్ణను అటకాయించి దాడి చేశారు. ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. దుండగుల దాడిలో ఆమెకు తలకు, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా చైన్ స్నాచింగ్ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో దుండగులను పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

దుండగులను ఉపేక్షించేది లేదు: ఎమ్మెల్యే

దాడి చేసి బంగారు పుస్తెల తాడును దోచుకెళ్లిన దుండగులను ఉపేక్షించేది లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. చికిత్స పొందుతున్న అన్నపూర్ణను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శుక్రవారం పరామర్శించారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు.

భార్యతో గొడవపడి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఢిల్లీకి చెందిన అసీమ్ అన్సారీ కుటుంబంతో వచ్చి తెల్లాపూర్ అంబేద్కర్ కాలనీలో నివాసముంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా గురువారం రాత్రి అసీమ్ అన్సారీ భార్య రేష్మతో గొడవపడ్డారు. దీంతో అతడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఆలయంలో చోరీ

నర్సాపూర్ : నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న తలమాత (నల్లపోచమ్మ) ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గ్రిల్స్ గేట్, గర్భగుడి తలుపులను ధ్వంసం చేసి దుండగులు లోనికి వచ్చారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి మెడలో ఉన్న పలు (వన్‌గ్రాం) గొలుసులు ఎత్తుకుపోయారు. కాగా పూజా సామగ్రిని మూట కట్టి గుడిలోనే వదిలి వెళ్లారు. హుండీ తాళాలు తెరిచేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై ఎస్‌ఐ శిరీషను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

278 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జహీరాబాద్: హైదరాబాద్ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామ శివారులో గల ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా హైదరాబాద్, పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యం షోలాపూర్ ప్రాంతానికి తరలిస్తున్న లారీ పట్టుబడింది. వాహనంలో 278 క్వింటాళ్ల మేర బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.8.89లక్షల విలువ కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అసభ్యంగా ప్రవర్తించినందుకే హత్య

- ఇద్దరు నిందితులు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రభాకర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 10న నసీర్‌ను హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రభాకర్ వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గకు చెందిన సంతోష్, భార్య ఉమాదేవి, బావమరిది రమేష్ పట్టణానికి వచ్చి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఇస్నాపూర్, ముత్తంగి పరిసర ప్రాంతాల్లో కాగితాలు ఏరుకుని, స్క్రాప్ దుకాణంలో విక్రయిస్తుండేవారు. అదే దుకాణంలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ నసీర్ సంతోష్ భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె సోదరుడు రమేష్‌తో చెప్పుకుంది. ఈ క్రమంలో ఈనెల 10న సంతోష్, రమేష్ పుట్టినరోజు వేడుక ఉందని నసీర్(19)ను పిలిచి, అతడిని తలను నేలకేసి కొట్టి హత్య చేశారు. అనంతరం వారు ఉంటున్న గదిలోనే మృతదేహాన్ని పెట్టి పరారయ్యారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పటాన్‌చెరు సీఐ వినాయక రెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలం, హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుల్ ఆంజయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

దివ్యాంగులకు మరో అవకాశం

- సహాయ ఉపకరణాలకు గడువు పొడిగింపు
- ఈనెల 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులు తమకు అవసరమైన సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేస్తామని, అర్హులైన లబ్ధిదారులు ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడువు ముగిసే నాటికి ఇంకా చాలా మంది దివ్యాంగులు ఆన్‌లైన్ సమస్యలు, ఇతర సమస్యల కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయారు. వారికి కూడా అవకాశం కల్పించేందుకు దరఖాస్తు గడువును ఈనెల 27 వరకు పెంచిందని అధికారులు తెలిపారు.

కావాల్సిన పత్రాలు

వైద్యశాఖ ఆధ్వర్యంలో ధ్రువీకరించిన సదరం సర్టిఫికెట్, ఆదాయం, కుల, నివాస ధ్రువ పత్రాలు అవసరం. వయస్సు నిర్ధారణ ధ్రువపత్రం, వైకల్యం కనిపించే పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు (3), ల్యాప్‌ట్యాప్, ట్యాబ్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వాహనం, 5జీ స్మార్ట్ ఫోన్స్ కోసం ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యనభ్యసిస్తున్న పాఠశాల, కళాశాలకు సంబంధించిన బోనఫైడ్, కళాశాల లేఖ దరఖాస్తు పత్రంతో పాటు జత చేయాలి. నిరుద్యోగులైన దివ్యాంగులు రెట్రో పిట్టెడ్ మోటో రైజ్డ్ వాహనం కోసం నోటరీచే అటెస్ట్ చేసిన రూ.100ల నాన్ జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పూర్తి చేసిన దరఖాస్తు పత్రాలను ఈనెల 27న సాయంత్రం 5గంటలలోపు మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని డీడబ్ల్యూఓ కార్యాలయంలో అందజేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ఇది మంచి అవకాశం. అర్హులైన వారు కావాల్సిన ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హత గల వారికి ఉపకరణాలు అందజేస్తాం. అర్హత గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– హైమావతి, డీడబ్ల్యూఓ, మెదక్

ఉసురు తీసిన కుటుంబ కలహాలు

విషం తాగి వ్యక్తి మృతి

పుల్‌కల్(అందోల్): కుటుంబ కలహాలతో ఇంట్లో ఇద్దరు వ్యక్తులు విషం తాగగా ఓ వ్యక్తి మృతి చెందాడు. పుల్‌కల్ పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన గూడపు శివలింగం (13) చిన్నమ్మ పుష్పలత గొడవపడ్డారు. ఒకరికి తెలియకుండా ఒకరు విషం తాగారు. కుటుంబ సభ్యులు గమనించి ఇద్దరిని అంబులెన్స్‌లో సంగారెడ్డికి తరలించగా పరిస్థితి విషమించడంతో శివలింగంను హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివలింగం మృతి చెందాడు. పుష్పలత ఆరోగ్యం నిలకడగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

చేర్యాల(సిద్దిపేట): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని తాడూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు కేసు పెట్టారన్న ఆవేదనతోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. గ్రామానికి చెందిన ఈరు రాజు, ఈరు రామకృష్ణ ఇద్దరు అన్నదమ్ములు. వీరి మధ్య కొద్ది రోజులుగా భూమి తగాదా కొనసాగుతుంది. ఈ క్రమంలో డబ్బులు, ఫోన్ దొంగిలించాడని ఈరు రామకృష్ణ తన అన్న రాజుపై చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసి కేసు పెట్టారని మనోవేదనకు గురైన రాజు గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ నీరేష్‌తో మాట్లాడగా తన డబ్బులు, ఫోన్ తీసుకుని తనతో గొడవపడ్డాడని ఈరు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఉద్దేశ పూర్వకంగా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..


శ్రీను

ములుగు(గజ్వేల్): భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండమీది శ్రీను(31)కూలీ పని చేసుకునేవాడు. ఎనిమిదేళ్ల క్రితం వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. వీరికి కూతురు ఉంది. సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో మూడేళ్ల క్రితం లావణ్య కూతురును తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.